క్లుప్తంగా

పసుపులేటి నీలిమకు 'కళామిత్ర' అవార్డు



నీలిమ

కర్నూలు కల్చరల్: రాష్ట్ర స్థాయి 'కళామిత్ర' ప్రతిభా అవార్డుకు కట్ట మంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పసుపులేటి నీలిమ ఎంపికయ్యారు. తెలుగు సాహిత్య రంగం, సామాజిక, ఆధ్యాత్మిక సేవ, తెలుగు భాషాభ్యున్నతికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డు వరించింది. కళా మిత్ర రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం జరిగే పురస్కారాల ప్రదానంలో నీలిమ అవార్డును అందుకోనున్నారు. రాష్ట్ర స్థాయి ప్రతిభా అవార్డుకు ఎంపికైన నీలిమకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

చిరు వ్యాపారులకు రక్షణ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే చిరు వ్యాపారులకు రక్షణ కల్పించాలని సీఐటీయూ అనుబంధం చిన్న వ్యాపారుల సంఘం న్యూసిటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. శనివారం కారిమ్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పేరుతో రెడ్, గ్రీన్, ఎల్లో జోన్లుగా విభజించి రోడ్డు పక్క వ్యాపారాలు చేసుకునే వారిని ఇబ్బంది పెట్టడం తగదన్నారు.

పిల్లలకు డిఫ్తీరియా టీకాలు వేయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 10, 15 ఏళ్లున్న పిల్లలందరికీ స్పెషల్ డ్రైవ్ ద్వారా టెటెటానస్ డిఫ్తీరియా(టీడీ) టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన నగర శివారులోని ఇ.తాండ్రపాడు పరిధిలోని పంచలింగాలలో ఉన్న ఏపీ రెసిడెన్సియల్ బాలికల హైస్కూల్‌లో నిర్వహిస్తున్న టీడీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడారు. ఐదేళ్లలోపు శిశు మరణాలకు శ్వాసకోశ వ్యాధులు కారణమవుతున్నాయన్నారు. నిమోనియా వ్యాధి లక్షణాలు జలుబు, దగ్గు, త్వరత్వరగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు ఉన్న పిల్లలకు పీసీవీ టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

కర్నూలు (టౌన్): అతివేగం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. శనివారం సాయంత్రం ర్యాష్ డ్రైవింగ్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

పుస్తకాల వితరణ



పుస్తకాలను గ్రంథాలయ కార్యదర్శికి అందజేస్తున్న లక్ష్మన్న

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సైకాలజిస్ట్ డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న తాను రచించిన లైఫ్' పుస్తకాలను ఉచితంగా అందజేశారు. శనివారం గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి పెద్దక్కకు ఆయన పుస్తకాలు అందజేశారు.

డిసెంబర్ 15న 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా విడుదల



మాట్లాడుతున్న దర్శక నిర్మాత సత్యారెడ్డి

కర్నూలు కల్చరల్: 'ఉక్కు సత్యాగ్రహం' సినిమాను డిసెంబర్ 15న విడుదల చేయనున్నట్లు సినిమా హీరో, దర్శక నిర్మాత సత్యా రెడ్డి తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా శనివారం కర్నూలుకు వచ్చిన సినిమా యూనిట్ సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్యారెడ్డి మాట్లాడుతూ సినిమాలో ప్రజా గాయకుడు గద్దర్ నటించడంతో పాటు నాలుగు పాటలు పాడారన్నారు. ఉక్కు సత్యాగ్రహం సినిమా ప్రధానంగా విశాఖ పట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తూ సినిమా తీశామని, ఆదరించాలని కోరారు. సమావేశంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

లీజు రద్దుకు ప్రతిపాదనలు

కర్నూలు (న్యూటౌన్): మైనింగ్ చేయని లీజుదారుల లీజులను వెంటనే రద్దు చేయాలని త్వరలో ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ శనివారం తెలిపారు.

అభివృద్ధికే పెద్దపీట

- సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం
- రెండేళ్లలో రూ.720 కోట్లతో కర్నూలులో అభివృద్ధి పనులు
- నగర మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య



సమస్యలను సభదృష్టికి తెస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (టౌన్): మరోసారి అభివృద్ధి పనులకే కర్నూలు నగరపాలక సంస్థ పాలకవర్గం పెద్దపీట వేసింది. రూ.17 కోట్లు విలువ చేసే పనులకు ఆమోదం తెలిపింది. నగరమేయర్ బీవై రామయ్య అధ్యక్షతన శనివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగింది. కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుకా, నాయకల్లు అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్న ఈ సమావేశంలో నగరంలోని వివిధ కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు 65 అంశాలపై చర్చ సాగింది. ప్రారంభంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 8 వ వార్డు కార్పొరేటర్ పరమేష్, 14 వ వార్డు కార్పొరేటర్ షేక్ జకియా అక్సారీలు తమ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టడం లేదంటూ ఆందోళన చేయగా మేయర్ స్పందించారు. పార్టీలకు అతీతంగా వార్డుల్లో పనులు చేపడుతున్నామని, టీడీపీ కార్పొరేటర్ వార్డులో రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. యూజర్‌చార్జీల విషయాన్ని కొంత మంది కార్పొరేటర్లు లేవనెత్తగా 50 శాతం తగ్గించినట్లు మేయర్ స్పష్టం చేశారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు ఆగ్రహం

➤ నగరంలో అనేక చోట్ల రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఏంచేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని ప్రశ్నించారు. ఖాళీ స్థలాలు సంరక్షించాలని పదే పదే చెబుతున్నా.. స్పందన లేదన్నారు. ఓపెన్ సైట్లను కాపాడుకుందామన్నారు. వీకర్ సెక్షన్ కాలనీలో డిస్పోజల్ డ్రైయిన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

➤ నగరంలోని పలుచోట్ల డబుల్ అసెస్‌మెంటు సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సుద్దవాగు సమస్యను పరిష్కరించడంలో ఇరిగేషన్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్‌ను శుభ్రం చేయాలని, మెష్ ఏర్పాటు చేయాలని చెప్పినా స్పందించడం లేదన్నారు.

➤ తన నియోజకవర్గానికి సంబంధించిన మూడు వార్డుల పరిధిలో పనులు సక్రమంగా జరగడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వరా అని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అధికారులను ప్రశ్నించారు. 9 నెలలుగా వీకర్ సెక్షన్ కాలనీ, సంతోష్‌నగర్ వద్ద మురుగు నీరు నిలిచిపోతుంది. ఈసమస్యను పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

➤ 41 వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, 40 వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, 26 వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతా రెడ్డి, 28 వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి, 29 వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, 38, 39 వార్డు కార్పొరేటర్లు సాంబశివారావు, గిప్సన్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు.

రాష్ట్రంలోనే ఆదర్శంగా కర్నూలు

తమ పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలోనే నగరంలో రూ.720 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని మేయర్ అన్నారు. ఈ అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే కర్నూలు నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రూ.28 కోట్లతో చేపట్టిన నూతన నగర పాలక కార్యాలయం నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ , అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేలో పురోగతి సాధించాలి

- ఇళ్ల నిర్మాణాల్లో వేగం పుంజుకోవాలి
- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): నిర్దేశించిన లక్ష్యం మేరకు రీసర్వే పనులు పూర్తి కావాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి హాలహర్వి, హొళగుంద, ఆలూరు మండలాల్లో తహసీల్దార్ లాగిన్లలో ఎక్కువ రోజులు రీసర్వేకు సంబంధించిన డేటా పెండింగ్‌లో ఉంటున్నాయని, 19 గ్రామాలకు సంబంధించి 20 రోజులకు పైగా తహసీల్దార్ లాగిన్లలో పెండింగ్‌లో ఉన్న వాటిని సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. 18–19 ఏళ్ల మధ్య వయసు యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్షన్–3ఇళ్ల నిర్మాణాల్లో సోమవారానికి పురోగతి కనిపించకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెగా కంప్లిషన్ డ్రైవ్ కింద జిల్లాలో 15,491 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. టీసీలో జేసీ నారపురెడ్డి మౌర్య, నగర పాలకసంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఈఆర్‌ఓలు మల్లికార్జునుడు, రమ పాల్గొన్నారు.

మైపర్‌లో ర్యాగింగ్‌పై అవగాహన

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శనివారం ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ కె.విజయశేఖర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించిరు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయరవి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల రాతలు మార్చిన పథకాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదల రాతలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెచ్చిందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం రాత్రి ఆయన స్థానిక 48వ వార్డు సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తొలగించేందుకు చేయూత, ఆసరా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, గోరుముద్ద వంటి పథకాలతో పాటు విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పేదల చెప్పిన సమస్యలు విని, వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, పార్టీ నాయకులు ఖాలిద్, మద్దయ్య, దాదా బాషా, సఫయా ఖాతూన్, జిలానీ, ఖలీలుల్లా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

27న టీటీడీ కార్తీక దీపోత్సవం



మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు కల్చరల్: స్థానిక ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్‌లో టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 27న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. శనివారం ఎస్వీ బీసీ చానెల్ సీఈఓ షణ్ముఖ్, కర్నూలు డీఎస్పీ విజ యశేఖర్‌తో కలిసి ఆయన కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ టీటీడీ, వెంకటేశ్వర భక్తి చానెల్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి 15,000 మంది భక్తులు హాజరయ్యే అవకాశముండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్వీబీసీ సీఈఓ మాట్లాడుతూ సాయంత్రం 5.30 గంటలకు మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి అనుగ్రహ భాషణంతో దీపోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం నుంచే పాసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. డీఎస్పీ మాట్లాడుతూ 300 మంది పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ రమేష్ బాబు, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు కార్తీక లక్ష దీపోత్సవం

కర్నూలు కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని వినాయక ఘాట్‌లో కార్తీక లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి ఘాట్‌లోని ప్రధాన వైదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, 5 గంటలకు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఘాట్ వరకు రథంపై శివపార్వతుల ఊరేగింపు, 5.30 గంటలకు జ్యోతి ప్రజ్వలన, 6 గంటలకు ఆకాశదీప ప్రజ్వలనం, 6.30 గంటలకు శివ పార్వతుల అభిషేకం, కల్యాణం, శివ పార్వతుల కల్యాణ విశిష్టతపై చిన్మయ విషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద చేత ప్రవచనం, 7.30 గంటలకు నాగఫణిశాస్త్రి బృందం చేత తుంగా (గంగా) హారతి, జ్వాలా తోరణం, జ్యోతులను గంగలో సామూహికంగా వదలడం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. కార్తీక దీపోత్సవ సమితి కార్యాధ్యక్షులు పద్మావతి, సమన్వయ కార్యదర్శి వై.వి.ఉమ, సహకార్యదర్శి రజని కల్కూర, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డ రామకృష్ణ, సమితి సభ్యులు మల్లికార్జునరెడ్డి, నాగోజిరావు తదితరులు వినాయక ఘాట్‌లో శనివారం ఏర్పాట్లను పరిశీలించారు.

రిజిస్ట్రార్ పదవీకాలం పొడిగింపు

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు పదవీకాలం ఈ నెల 26వ తేదీతో ముగియనుండగా మరో ఏడాది పాటు పొడిగించినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఫజులూర్ రహమాన్ శనివారం తెలిపారు.

వచ్చే నెల 2న మెగా జాబ్ మేళా

కర్నూలు సిటీ: వచ్చే నెల 2న అన్నమయ్య జిల్లా రాయచోటిలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కాలేజీలో రాయలసీమ జోన్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ వి.శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 బహుళ జాతి కంపెనీలు హాజరుకానున్నాయని, ఈ అవకాశాన్ని పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, ఫార్మసీ–బీ, ఫార్మసీ–డి, ఫార్మసీ–ఎం, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సున్న రాయలసీమ పరిధిలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9988853335 సంప్రదించాలన్నారు.

లింగ వివక్షతను రూపుమాపుదాం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): లింగ వివక్షతను రూపుమాపుదామని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. డీఆర్‌ఓ మధుసూదన్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి, డీఎల్‌పీఓ తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు. కాగా వైకేపీ కార్యాలయంలో జెంబర్ రిసోర్స్ సెంటరును డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా ప్రారంభించారు. అనంతరం మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్షతను నిరసిస్తూ కలెక్టరేట్‌లో ప్రదర్శన నిర్వహించారు.

అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ కోరారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. తెలంగాణ కంటే రూ.1,000 ఎక్కువ జీతం ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

గోపాల్ సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్: కళా రంగంలో పల్లె గోపాల్ సేవలు చిరస్మరణీయమని పలువురు కళాకారులు గుర్తు చేసుకున్నారు. మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో శనివారం కళాకారుడు పల్లె గోపాల్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు సీనియకర్ కళాకారులు పూలమాలలువేసి నివాళుర్పించారు.

విజేతలు పశ్చిమగోదావరి, కడప జట్లు





చాంపియన్ ట్రోఫీలు అందుకుంటున్న పశ్చిమగోదావరి జిల్లా బాలికల, కడప బాలుర జట్లు

కర్నూలు (టౌన్): నగర శివారులోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర విభాగంలో కడప జిల్లా, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్లు చాంపియన్‌లుగా నిలిచాయి. అండర్–17 బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ద్వితీయ, విజయనగరం జిల్లా తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో కడప ద్వితీయ, తూర్పు గోదావరి జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ –19 బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా ప్రథమ, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ, కడప జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి హనుమంతరావు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాలుగవ పట్టణ సీఐ శ్రీరామ్, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ బేతం క్రిష్ణుడు, పోటీల రాష్ట్ర పరిశీలకులు నాగశిరీషా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.జోసఫ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.


జాతీయ పోటీలకు కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కర్నూలు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిని శనివారం డీవీఈఓ జమీర్‌బాషా తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో అండర్–19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పద్మావతి, హ్యాండ్‌బాల్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

యాడికి: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన కేసులో ఆమె భర్త, అత్తపై యాడికి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. యాడికికి చెందిన మల్లేశ్వరికి కోడుమూరుకు చెందిన వెంకటేశ్వర్‌తో వివాహమైంది. ఏడాది కాలంగా తనకు అదనపు కట్నం కావాలంటూ వెంకటేశ్వర్‌తోపాటు అతని తల్లి వేధింపులకు గురి చేస్తుండడంతో విసుగు చెందిన మల్లేశ్వరి శనివారం యాడికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్మ వెంకటేశ్వర్లు ఆగడాలను అరికట్టాలి



మహిళలకు మద్దతు పలుకుతున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): డీఎస్పీ యుగంధర్‌బాబు అండతో కమ్మ వెంకటేశ్వర్లు చేస్తున్న ఆగడాలను అరికట్టాలని కురువ సంఘం జిల్లా కార్యదర్శి కె.రంగస్వామి డిమాండ్ చేశారు. డబ్బు తీసుకుని మోసం చేశారంటూ కల్లూరుకు చెందిన కురువ సుగుణ, లక్ష్మి శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో చేపట్టిన దీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుంది. వీరికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, కురువ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన కిరణ్‌కుమార్, కల్లూరు మండల మాజీ ఎంపీపీ పెద్ద అమీను, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె శివన్న, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషఫని, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ కమ్మ వెంకటేశ్వర్లు 12 ఏళ్ల క్రితం సుగుణ, లక్ష్మిల వద్ద రూ.15 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా సతాయస్తున్నాడన్నారు. వారికి బ్యాంకు వడ్డీ రేటు ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ యుగంధర్ బాబు వ్యవహారంపై కూడా జిల్లా ఎస్పీ విచారణ జరపాలని కోరారు.

హక్కులపై అవగాహన అవసరం

కర్నూలు సిటీ: హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి

కర్నూలు కల్చరల్: అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా అటవీ శాఖ అధికారి పి.శివశంకర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కర్నూలు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎఫ్‌ఆర్‌ఓ, బీట్ ఆఫీసర్లు, కార్యాలయ ఉద్యోగులతో మాట్లాడారు. ఫైల్స్ సర్క్యులేషన్, పెండింగ్ కోర్టు కేసులు, పెండింగ్ బిల్స్, అప్‌లోడ్ బిల్స్‌ను పరిశీలించారు. ప్రత్యామ్నాయ వనీకరణ పురోగతి పనులు తదితర అంశాలపై సమీక్షించారు. అత్యవసర సమయాల్లో ఉద్యోగులు అందరూ స్పందించాలన్నారు. అగ్ని ప్రమాదాలు, అడవుల అన్యాక్రాంత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు ఎఫ్‌ఆర్‌ఓ పీరయ్య పాల్గొన్నారు.